క్లుప్తంగా

విద్యుత్ బిల్లులు చెల్లించాలి

గోస్పాడు: వినియోగదారులు విద్యుత్ బిల్లులను సరైన సమయానికి చెల్లించాలని ఏఈ జ్ఞాన సూర్యుడు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది బిల్లులు సకాలంలో సక్రమంగా చెల్లించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అక్రమంగా విద్యుత్ వినియోగించడాన్ని ఎప్పటికప్పుడు గుర్తించాలని చెప్పారు. గ్రామాల్లో ఏవైనా విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వైన్‌షాపు తొలగించాలి

నంద్యాల(అర్బన్): పట్టణంలోని బొమ్మల సత్రం వద్ద ఉన్న వైన్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లను తొలగించాలని సీపీఐ(ఎంఎల్) ఆర్‌ఐ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజు కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ వైన్‌షాపులో మద్యం తాగిన దుండగులు ఇటీవల అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వైన్‌షాప్ వద్దంటూ గతంలో మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు చేసిన ఆందోళనలు అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

అడవికి నిప్పపెడితే కఠిన చర్యలు

ఆళ్లగడ్డ: అడవికి నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవని చాగలమర్రి మండలం అటవీ శాఖ అధికారి కిశోర్ కుమార్ తెలిపారు. బైరవ గుండాల క్షేత్రంలో శనివారం అడవికి నిప్పు.. అది మనకే ముప్పు అని స్థానికులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అడవిలో నిప్పు పెట్టడం వలన పక్షులు, చెట్లు, ఔషధమొక్కలు సమూలంగా నాశనమవుతున్నాయన్నారు. అడవిలో నిప్పు రాజుకుంటే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమచారం ఇవ్వాలని కోరారు. వన్యప్రాణులకు హాని జరిగేలా ఉచ్చులు, వలలు వేస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఎఫ్‌బీఓ నాగేష్, నరసింహ, రాయుడు, నర్సయ్య ఉన్నారు.

ఆలయాల్లో శనిత్రయోదశి పూజలు



శనీశ్వరుడికి పూజలు చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పలు దేవాలయాల్లో శనివారం మహాశివరాత్రి, శనిత్రయోదశి సందర్భంగా నవగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 40 ఏళ్ల క్రితం ఇలా రెండు ఒకేసారి వచ్చాయని, ఇలాంటి అవకాశం ఇప్పట్లో రాదని పండితులు మాడుగుల సుబ్రమణ్యశాస్త్రి తెలిపారు. మహాశివరాత్రి రోజున శనైశ్వరుడికి అభిషేకాలు, దానాలు చేయడం వల్ల కష్టాలు, బాధలు తొలగుతాయన్నారు. కాళికాంబ చంద్రశేఖర దేవస్థానం, బైటిపేట ఆంజనేయస్వామి గుడి, సంజీవనగర్ రామాలయం, సోమనందీశ్వరస్వామి, నాగలింగేశ్వరస్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మాఘమాసం చివరి శనివారం సందర్భంగా మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనిత్రయోదశి, శివరాత్రి కావడంతో నవగ్రహాలకు పూజలు చేశారు. తమలపాకుల మాలలు, తులసీ మాలలు విశేష అలంకరణ చేపట్టి అభిషేకాలు, ఆకుపూజ, కుంకుమార్చన, వడపప్పుతో నైవేద్యం సమర్పించారు.

అనంతపురం జిల్లా వృషభాల జయకేతనం



విజేతలైన ఎద్దుల యజమానులకు నగదు అందజేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మహాశివరాత్రిని పురస్కరించుకొని నందికొట్కూరు పట్టణంలోని జీవన్‌జ్యోతి స్కూల్ సమీపంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీల్లో మొత్తం 11జతల ఎద్దులు పోటీపడగా అనంతపురం జిల్లా, చర్రాయపేటకు చెందిన వృషభాలు విజయకేతనం ఎగురవేసి రూ.50వేల నగదును దక్కించుకున్నారు. నెలటూరుకు చెందిన గాజుల కుమారస్వామి వృషభాలు ద్వితీయస్థానంలో రూ.40వేలు, జిల్లెల్లకు చెందిన రవితేజేశ్వరరెడ్డి ఎద్దులు మూడో స్థానంలో నిలిచి రూ.30వేలు కైవసం చేసుకున్నాయి. ఆతరువాతి స్థానాల్లో వరుసగా బైరవాడి లక్ష్మన్న ఎద్దులు రూ.20వేలు, ఓర్వకల్లు నడిపి వెంకటేశ్వర్లు రూ.15వేలు, కొత్తపల్లి దుబ్బన్న వృషభాలు రూ.10వేలు, గుమ్మడం కుమారస్వామి ఎద్లు రూ.8వేలు, సీసంగుంతల లక్ష్మిరెడ్డి భరత్‌చంద్రారెడ్డి ఎద్దులు రూ.6వేలు, పెబ్బేరు బోయిన వెంకటకృష్ణయాదవ్ ఎద్దులు 5వేలు చేజిక్కించుకొన్నాయి. విజేతలకు చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, దాతలు బహుమతులు అందజేశారు.

హర హర శంభో.. శివ మహాదేవ



నాగులకుంట రోడ్డులో ప్రత్యేక అలంకరణలో నాగలింగేశ్వర స్వామి



సంజీవనగర్ రామాలయంలో కాశీవిశ్వనాథుడికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం



నంద్యాలలో ప్రథమనందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



ఆళ్లగడ్డ సమీపంలోని కాచింతల క్షేత్రంలో స్వామి వారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- శివనామ స్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- భక్తులతో కిటకిటలాడిన శైవాలయాలు
- అభిషేకప్రియుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు
- వేడుకగా శివపార్వతుల కల్యాణం



నంద్యాల నాగులకుంట రోడ్డులోని నాగలింగేశ్వర దేవాలయంలో క్షీరాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



ఇంజేడులో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న పండితులు

నంద్యాల(వ్యవసాయం):మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పరమేశ్వరుడికి భక్తులు అభిషేకాలు, పూజలు చేశారు. పలు ప్రాంతాల్లో స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. పట్టణంలోని పలు శివాయాలను దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచే బారులుదీరారు.

☛ ప్రథమనంది క్షేత్రంలో తెల్లవారుజాము నుంచే అభిషేకాలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి అన్నాభిషేక కార్యక్రమం నిర్వహించారు. కేదారేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి లింగోద్భవ కాలం అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం జరిపించారు.

☛ సోమనంది క్షేత్రంలో సోమనంది, సోమేశ్వరదేవికి భక్తులు అభిషేకాలు, పూజలు చేపట్టారు. బైటిపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో నవనందుల్లో రెండవ నంది నాగనందిలో భక్తులు స్వామి వారికి జలాభిషేకంచేసి పుష్పాలంకరణ గావించారు.

☛ చిన్నచెరువు కట్ట వద్ద ఉన్న శ్రీభీమేశ్వర స్వామికి భక్తులు అభిషేకాలు చేసి పూజలు చేశారు.

☛ బ్రహ్మనందీశ్వరస్వామి, రోజాకుంటలోని నాగలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రి కల్యాణం నిర్వహించారు.

☛ మెయిన్‌బజార్‌లోని అమ్మవారి శాలలో నగరేశ్వరస్వామికి ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వట్టివేర్ల నీళ్లతో అభిషేకం చేశారు.

☛ సంజీవనగర్ రామాలయంలో ఉదయం నుంచే కాశీవిశ్వేరస్వామికి అభిషేక పూజలు చేపట్టారు.సామూహిక కుంకుమార్చనలు, రాత్రి 108 కలశాతో అభిషేకం చేశారు.లింగోద్భవ అనంతరం కాశీవిశ్వనాథునికి,కాశీ విశాలాక్షి అమ్మవారికి కల్యాణం జరిపించారు.

☛ నాగులకుంట రోడ్డులోని నాలింగేశ్వరస్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించి రాత్రి వివిధ పండ్ల రసాలతో స్వామి వారిని అభిషేకించి, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేయించారు.

☛ గాంధీచౌక్‌లోని శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో స్వామి వారికి ఉదయం నుంచే పంచామృతాభిషేకాలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు చేపట్టారు. రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. గుడిపాటిగడ్డలోని మల్లికార్జునస్వామి దేవస్థానంలో రాత్రి స్వామి అమ్మవార్లకు కల్యాణం జరిపించారు.

☛ ఉయ్యాలవాడ: మహా శివరాత్రి సందర్భంగా శనివారం గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున 4 గంటల నుంచి స్థానిక అగస్త్యేశ్వర ఆలయంలో పండితులు భాస్కర శర్మ, రవికుమార్‌శర్మ, మోహనకృష్ణ ఆధ్వర్యంలో గణపతి పూజ, నవగ్రహ మండప ఆరాధన, రుద్రాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

☛ **వైభవంగా శివపార్వతుల కల్యాణం..**

ఇంజేడు గ్రామంలో శనివారం మహా శివరాత్రి సందర్భంగా శివాలయ ఆవరణలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ శీలం హరిశ్చంద్రనాగిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వేడుక సాగింది. భక్తుల సమక్షంలో, మంగళవాయిద్యాల నడుమ ఆలయ అర్చకులు అనంతయ్య, రమణయ్య, సుధాకర్‌శర్మ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం చేపట్టారు

☛ శిరివెళ్ల: మండలంలో శనివారం మహాశివరాత్రి పర్వదినం ఘనంగా జరిగింది. శిరివెళ్ల, గోవింద పల్లె, యర్రగుంట్ల, మహదేవపురం, కోటపాడు శివాలయాలలో తెల్లవారుజాము నుంచే భక్తులు శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది.

☛ దొర్నిపాడు: మండలంలో మహాశివరాత్రి పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అన్ని శివాలయాల్లో భక్తులు వేకువజాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశైలం, మహానంది, యాగంటి, ఓంకారేశ్వరం తదితర శైవ క్షేత్రాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఆలయాల్లో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

☛ ఆళ్లగడ్డ: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నియోజవర్గంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. శనివారం తెల్లవారుజాము నుంచే ముక్కంటికి ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీరామతీర్థ పుట్టాలమ్మ క్షేత్రంలో వెలసిన శ్రీ పార్వతీ పరశురామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజ లు చేపట్టారు. దేవస్థాన పాలక మండలి ఆధ్వర్యంలో లింగోద్భవ కాలంలో స్వామికి మహాన్యాస పూ ర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం కల్యాణోత్సవం జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పట్టణంలోని శివాలయంలో శివుడికి అభిషేకం, అర్చనలు చేయించారు. బ్రహ్మకుమారి ఈశ్వరీ య విద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిరూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పట్టణ శివారులోని కాచింతల క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.

☛ రుద్రవరం: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం మండలంలోని శివాలయాల్లో వేడుకలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆలయాల్లో వెలసిన స్వామి అమ్మవార్లకు అభిషేకాలు,పూజలు నిర్వహించారు. స్థానిక భాస్కర నందీశ్వరస్వామి, వెలగలపల్లె, చిన్నకంబలూరు, కోటకొండ, ఎల్లావత్తుల, మందలూరు, ఎర్రగుడిదిన్నె, పేరూరు, చిలుకలూరు తదితర గ్రామాలతో పాటు నల్లమల అటవీ ప్రాంతంలోని ఉల్లెడ మల్లేశ్వరస్వామి వారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. పేరూరు ఈశ్వర,రామాంజనేయ,వీరభద్ర స్వామి ఆలయంలో శివ పార్వతుల ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం చేపట్టారు.



పుట్టాలమ్మ క్షేత్రంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న దృశ్యం



పేరూరులో శివ,పార్వతుల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



దొర్నిపాడులోని శివాలయంలో ఓంకార రూపంలో వెలుగుతున్న దీపాలు



ఉయ్యాలవాడ అగస్త్యేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఉయ్యాలవాడ: శివపార్వతుల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



శిరివెళ్లలో శివునికి పూజలు చేస్తున్న భక్తులు

మహానందిలో ప్రముఖులు

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా మహానందిలో శనివారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. నంద్యాల జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, నంద్యాల ఆర్‌డీఓ శ్రీనివాసులు వేర్వేరుగా మహానంది వచ్చారు. అలాగే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి దంపతులు స్వామివారి దర్శనార్థం వచ్చారు. మహానంది మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, సీతారామాపురం సర్పంచ్ బుడ్డారెడ్డి తేజస్వినిలు మహానందీశ్వరుడిని దర్శించుకుని పూజలు చేపట్టారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి పూజలు నిర్వహింపచేశారు. అనంతరం వారికి స్వామి,అమ్మవార్ల ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.



మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన విజిలెన్స్ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన డీసీ

దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రాణాప్రతాప్ శనివారం మహానందిలో శివరాత్రి ఏర్పాట్లు పరిశీలించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఈఓ ఎర్రమల మధు, సూపరింటెండెంట్లు ఓంకారం వెంకటేశ్వరుడు, అంబటి శశిధర్‌రెడ్డిలతో వివిధ అంశాలపై చర్చించారు. వారి వెంట మద్దిలేటిస్వామి దేవస్థానం ఈఓ పాండురంగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో కేంద్రం పక్షపాతం

నంద్యాల(అర్బన్): విద్యారంగానికి కేటాయించిన నిధుల్లో కేంద్ర ప్రభుత్వం పక్షపాతం చూపిందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ విమర్శించారు. కేవలం 2.5 శాతం మాత్రమే నిధులు కేటాయించడంతో విద్యారంగ అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించా రు. స్థానిక కార్యాలయంలో శనివారం సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.ఆయన మా ట్లాడుతూ యూనివర్సిటీల్లో విజ్ఞా న శాస్త్రాల బదులు మతోన్మాద శాస్త్రాలు, జ్యోతిష్యం,మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావాజాలంతో కూడుకున్న సిలబస్ ప్రవేశపెడుతున్నారని ఆరోపించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, 11 కేంద్రీయ విద్యా సంస్థల స్థాపన, విశాఖకు రైల్వేజోన్, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలకు సంబంధించి నిధులు ఇవ్వకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను విద్యార్థులు, యువత ఖండించాలని, రాష్ట్రాభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, దస్తగిరి, నవీన్, అనిల్, శ్యాం, నరసింహ పాల్గొన్నారు.

శ్రీ మద్దిలేటయ్య ఆదాయం రూ.3,38,102

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామిని దర్శించుకునేందుకు శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.3,38,102 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. అదేవిధంగా స్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి డోన్ పట్టణానికి చెందిన మారం శంకర్ రెడ్డి, వెంకట చిన్నమ్మ జ్ఞాపకార్థం వెంకటేశ్వరెడ్డి రూ.1,00,116 లక్షలు, తెలంగాణా రాష్ట్రం గద్వాల పట్టణానికి చెందిన మద్దిలేటి రూ.50 వేలు, కర్నూలు పట్టణానికి చెందిన కురువ దండు వెంగన్న రూ.25 వేల విరాళం అందజేశారు.

నేడు బండలాగుడు పోటీలు

కొలిమిగుండ్ల: పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి క్రీడా మైదానంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నుంచి రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు పాలపళ్ల సైజు, సోమవారం యుకేటగిరీ విభాగం పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

క్రైమ్ కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



మృతి చెందిన షర్ఫుద్దీన్



మృతి చెందిన మనోజ్ఞ

ఆళ్లగడ్డ: మండల కేంద్రం చాగలమర్రి సమీప జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని షర్ఫుద్దీన్ (29) అనే వ్యక్తి మృతి చెందాడు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు కు చెందిన షర్ఫుద్దీన్ కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. కూరగాయల లావాదేవీల విషయం మాట్లాడేందుకు శిరివెళ్లకు వచ్చి శనివారం రాత్రి తిరిగి తన బుల్లెట్ బైక్‌పై ప్రొద్దుటూరుకు బయలుదేరాడు. చాగలమర్రి చాగలమ్మ వంక సమీపంలోకి వచ్చే సరికి వెనుక నుంచి గుర్తతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. అలాగే..రూరల్ మండలం పేరాయిపల్లె మెట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరబాద్‌కు చెందిన మనోజ్ఞ (28) అనే యువతి అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి అనంతరం చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. హైదరబాద్‌కు చెందిన మనోజ్ఞకు తిరుపతిలోని వ్యవసాయ కళాశాలలో ఎమ్మెస్సీ సీటు రావడంతో జాయిన్ అయి తిరిగి శుక్రవారం సొంత కారులో డ్రైవింగ్ చేసుకుంటూ హైదరబాద్ బయలుదేరింది. ఈ క్రమంలో పేరాయిపల్లె మెట్ట సమీపంలో నిద్రమత్తులో ఆగి ఉన్న టిప్పర్‌ను వెనక నుంచి ఢీ కొట్టింది. దీంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందిందని, కేసు నమోదు చేసుకున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

బనగానపల్లెరూరల్: నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి శనివారం కోవెలకుంట్ల మండలం జోలదరాశి గ్రామానికి చెందిన సింగారెడ్డి సుదర్శన్‌రెడ్డి రూ.25వేలు విరాళాన్ని ఈఓ రామానుజన్‌కు అందజేశారు.

గుడిసె దగ్ధం



పెదకంబలూరులో కాలిపోయిన గుడిసె

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరులో శుక్రవారం అర్ధరాత్రి దాటాక అగ్ని ప్రమాదం సంభవించి గ్రామ వలంటీర్ కిరణ్ గుడిసె దగ్ధమైంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గుడిసెకు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయిందని ఆరోపించారు. కాగా ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులు ఆరుగురు గుడిసెలో నిద్రిస్తున్నారు. మంటలు చెలరేగడాన్ని గుర్తించి అందరూ బయటకు వచ్చేయడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లో వస్తువులు,డబ్బులు,ధాన్యం కాలి బూడిదయ్యాయని వాపోయారు. ఇందుకు కారణమైన నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డీసీఎం వాహనం బోల్తా

కోవెలకుంట్ల: సంజామల మండలం పేరుసోముల సమీపంలో శనివారం డీసీఎం వాహనం బోల్తా పడింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. విజయవాడ నుంచి అనంతపురం పట్టణానికి సబ్బులు, సర్ఫ్ ప్యాకెట్ల లోడుతో వెళ్తున్న డీసీఎం అదుపు తప్పింది. వాహన యజమాని అయిన డ్రైవర్ వెంకట నాయుడు ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

అశాస్త్రీయంతో ఆపద

- పాము కాటు వేస్తే మంత్రాలు, నాటు వైద్యం అంటూ ఆలస్యం చేయొద్దు
- ప్రాణాలు పోతున్నా గ్రామాల్లో మారని ధోరణి
- గత ఏడాది పాముకాటుతో 273 మంది ప్రభుత్వాసుపత్రికి
- వీరిలో 241 మందిని రక్షించిన వైద్యులు
- ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులో ఆధునిక చికిత్స

☛ ఐదు నెలల క్రితం బండిఆత్మకూరు మండలం నెమళ్లకుంట గ్రామంలో వ్యవసాయ కూలీ పొలం పనికి వెళ్లాడు. కాలికి ఏదో విష పురుగు కరిచిందని గుర్తించి నడుచుకుంటూ గ్రామానికి వెళ్లిన 5 నిమిషాల్లోనే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు పాము కాటు వేసిందని నాటు వైద్యుడిని ఆశ్రయించారు. సాయంత్రానికే అతడు మరణించాడు.

☛ మూడు నెలల క్రితం గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామానికి చెందిన రైతు తన వరి పొలాన్ని చూసేందుకు వెళ్తుండగా పాము కాటుకు గురయ్యాడు. వెంటనే నంద్యాల ప్రభుత్వాసుపత్రికి వెళ్లగా వైద్యులు స్నేక్ యాంటి వీనం ఇంజెక్షన్ వేసి చికిత్స చేశారు. రెండు రోజుల్లోనే ప్రాణాపాయం నుంచి బయట పడి క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు.

నంద్యాల: పొలం పనుల్లో నిమగ్నమై ఉండే రైతులు, కూలీలు తరచూ పాము కాటుకు గురవుతుంటారు. అయితే ఆ సమయంలో నాటు వైద్యం (పసరు మందు) జోలికి వెళ్లకుండా ప్రభుత్వాసుపత్రిలో వైద్యలను సంప్రదించి చికిత్స పొంది ప్రాణాలు కాపాడుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో పాములు వేడికి తలదాచుకోవడానికి అనేక ప్రాంతాలను ఆవాసాలుగా ఎంపిక చేసుకుంటాయి. గత ఏడాది 273 మంది పాముకాటుకు గురై నంద్యాల ప్రభుత్వాసుపత్రికి వస్తే అందులో 241 మందికి వైద్యులు చికిత్స చేసి క్షేమంగా ఇంటికి పంపారు.

పాములను గుర్తించండిలా..

నాగుపాము..

నాగుపాము ముదురు గోధుమ రంగులో ఉంటుంది. మనకు కనిపించే పాములోకెల్లా అత్యంత ప్రమాదకరమైనది. ఇది కాటు వేస్తే 15నిమిషాల్లో విషం శరీరంలోకి వేగంగా ప్రవేశిస్తుంది. ఇది మనిషి నాడీ వ్యవస్థ మీద ఎక్కువ ప్రభావం చూపుతుంది. కాటు వేసిన వెంటనే గాయాన్ని తొలగించి గాయం పైభాగంలో గట్టిగా గుడ్డ కట్టాలి. ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి.

కట్లపాము..

ఇది నలుపురంగులో ఉండి ఒంటిపై నలుపు, తెలుపు చారలు ఉంటాయి. నాగుపాము విషం కంటే ఈ పాము విషం చాలా ప్రమాదకరమైంది. ఇది సామాన్యంగా కరవటం చాలా తక్కువ. కాటు వేస్తే మాత్రం విషం వెంటనే శరీరంలోకి ప్రవేశిస్తుంది. రక్తం శరీరంలోకి ప్రవహించక మునుపే ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకుంటే త్వరగా తేరుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఇది ఎక్కువగా మురుగు ప్రాంతంలో ఉంటుంది.

రక్తపింజరి..

పొడపామునే రక్తపింజరి అని పిలుస్తారు. ఇది గోధుమ రంగులో ఉండి ఒంటిపై డైమాండ్ ఆకారంలో గుర్తులు మూడు వరుసల్లో ఉంటాయి. తలపై బాణం గుర్తు ఉంటుంది. ఇది కాటు వేసిన భాగం ఉబ్బెత్తుగా ఉండి నొప్పి కలిగిస్తుంది. ఇది కాటు వేయకుండా మనిషి శరీరాన్ని పట్టి రక్తం పీల్చేస్తుంది. ఇది కరిచిన 2 గంటల్లోపు విషం శరీర భాగాల్లోకి వెళ్తుంది.

కాటేస్తే లక్షణాలు..

➡ సాధారణంగా విషమున్న పాము కాటు వేసిన చోట రెండు కోరల గాయం కనిపిస్తుంది.

➡ నొప్పి తట్టుకోలేం. నొప్పి క్రమంగా పైకి వ్యాపించి తిమ్మిరిగా అనిపిస్తుంది. గొంతు, కండరాళ్లు బిగుచుకున్నట్లు, నాలుగుక మందమైనట్లు గొంతులోకి ఏదీ దిగనట్లు అనిపిస్తుంది.

➡ చొంగకారడంతో పాటు శరీరం మత్తుగా ఉంటుంది. శరీరం చల్లగా మారిపోతుంది.

➡ ఛాతిలో విపరీతమైన నొప్పితో పాటు ఆయాసం వస్తుంది. సకాలంలో చికిత్స అందకపోతే తలలో రక్తస్రావం మూత్రపిండాలు పాడై ప్రాణం పోయే అవకాశం ఉంది.

➡ పాము కాటుకు గురైన వ్యక్తిని నడిపించరాదు.



సత్వర చికిత్స అవసరం

పాము కరిచిన వెంటనే స్నేక్ యాంటీవీనం ఇవ్వాలి. ఈ ఇంజెక్షన్లు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్నాయి. నాటువైద్యం, మంత్రాలపై నమ్మకంతో ఆలస్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. వర్షా కాలం, వేసవి కాలం రెండు సీజన్లలో పాముకాటు బాధితులు ఎక్కువగా వస్తున్నారు. పాముకాటుకు గురైన వ్యక్తుల్లో చాలా మంది భయంతో గుండె ఆగి చనిపోతున్నారు.

– డాక్టర్ వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ, నంద్యాల